సాక్షి
పెద్దపల్లి
శుక్రవారం । 15 । ఆగస్టు । 2025

పంద్రాగస్ట్ వేడుకలకు పోలీస్ పరేడ్ గ్రౌండ్ ముస్తాబు

పెద్దపల్లిరూరల్: కలెక్టరేట్ ఆవరణలోని పోలీస్ పరేడ్‌గ్రౌండ్ పంద్రాగస్టు వేడుకలకు ముస్తాబైంది. కలెక్టర్ కోయ శ్రీహర్ష గురువారం ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అడిషనల్ కలెక్టర్ వేణు ఉన్నారు.






మా భూమి.. మా దేశం.. మా ప్రాంతం.. మా సొత్తు.. మా మనుషులు నినాదంతో ఎందరో మహనీయుల పోరాటాలతో సాధించుకున్న స్వాతంత్ర్య భారతదేశం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోంది. ఉద్యమ సమయం నాటి అనేక సంఘటనలు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఇంకా కళ్ల ముందు కదలాడుతున్నాయి. స్వాతంత్ర్య పోరాటానికి వేదికైన మెట్‌పల్లి ఖాదీప్రతిష్టాన్ విదేశీ వస్తు బహిష్కరణలో కీలక పాత్ర పోషించింది. తాజాగా పొలిటికల్ బ్రాండ్‌గా పేరొందుతోంది. ఉమ్మడి జిల్లానుంచి ఎందరో మహనీయులు ఉద్యమంలో కీలకంగా వ్యవహరించారు. అమరులైన వారి పేరిట శిలాఫలకాలు ఆయా ప్రాంతాల్లో దర్శనమిస్తున్నాయి. నాటికీ.. నేటికీ పరిస్థితులు మారాయి. 78 ఏళ్ల స్వాతంత్ర్య భారతదేశం అభివృద్ధిలో దూసుకుపోతోంది. అయినప్పటికీ విద్య, వైద్యం, చట్టాలపై మరింత చైతన్యం రావాల్సిన అవసరం ఉందని నేటి యువత అంటోంది. 2047 నాటికి వందేళ్ల భారతదేశాన్ని పునర్నిర్మిస్తామని సగర్వంగా చెబుతోంది. నేడు 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా..

సగర్వంగా.. స్వాతంత్ర్యంగా

- స్వాతంత్ర్య ఉద్యమంలో ఉమ్మడి జిల్లా గుర్తులు
- పోరాటానికి వేదికైన ఖాదీ ప్రతిష్టాన్
- దేశం కోసం పోరాడిన మహనీయులు
- 2047 నాటికి వందేళ్ల స్వాతంత్ర్య భారతంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసిన యువత
- నేటి పంద్రాగస్టు వేడుకలకు సర్వం సిద్ధం

(నేడు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గడిచిన 78ఏళ్లలో, ప్రస్తుత సమాజం ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లు, పరిస్థితులపై ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో 100 మందిని పలుకరించగా.. వెల్లడించిన అభిప్రాయాలు ఇలా..)



ప్రస్తుతం ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య? | స్వేచ్ఛా, సమానత్వం ఎక్కడైనా కనిపిస్తున్నాయా? | స్వాతంత్ర్య ఫలాలు అందరికీ దక్కాలంటే నిజాయితీగా పని చేయాల్సిన రంగం?

పొలిటికల్ బ్రాండ్.. మెట్‌పల్లి ఖాదీ ప్రతిష్టాన్



మెట్‌పల్లి ఖాదీ ప్రతిష్టాన్

కోరుట్ల/మెట్‌పల్లి: ఇక్కడి నేతలకు ఖాదీ బట్టలే స్ఫూర్తి. చాలా మందికి ఖాదీ రాజకీయంగా ఊపిరి పోసిందంటే అతిశయోక్తి కాదు. స్వాతంత్ర్య పోరాటకాలంలో ఖాదీ ఉద్యమానికి వేదికగా నిలిచింది జగిత్యాల జిల్లాలోని మెట్‌పల్లి. గాంధీ శిష్యుడు అన్నాసాహెబ్ ఆధ్వర్యంలో మెట్‌పల్లిలో వెలిసిన ఖాదీ ప్రతిష్టాన్ ఖద్దరు ఆ కాలంలో ఖ్యాతి పొందింది. అప్పటి ఆనవాయితీని పుణికిపుచ్చుకుని మెట్‌పల్లి ప్రాంత రాజకీయ నాయకులు ఖాదీ వస్త్రాలు ధరించడం ఇప్పటికీ దూరం కాలేదు. కడక్ ఖాదీ బట్టలతో ఎవరైనా కనిపిస్తే చాలు ఈయన మెట్‌పల్లి లీడరని చెప్పొచ్చు. 1983లో ఎన్టీఆర్ ప్రభుత్వ హయంలో కార్మికశాఖ మంత్రిగా పనిచేసిన వర్దినేని వెంకటేశ్వర్‌రావు, మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్.విద్యాసాగర్‌రావు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా జెడ్పీ మాజీ చైర్మన్ కేవీ.రాజేశ్వర్‌రావు, జనతా పార్టీ నుంచి ఏకైక ఎమ్మెల్యేగా ఎన్నికైన కొమొరెడ్డి రామ్‌లు, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ ఖాదీ ప్రతిష్టాన్ వస్త్రాలు ధరించి రాజకీయాల్లో కీలకంగా ఎదిగిన వారే. 2009 అసెంబ్లీ పునర్విభజనలో కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గంగా మారినప్పటికీ.. మెట్‌పల్లి ఖాదీ కార్ఖానా స్ఫూర్తిగా రాజకీయాల్లోకి వచ్చిన నేతలు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, సంజయ్ ఇక్కడి ఎమ్మెల్యేలుగా కొనసాగడం గమనార్హం.

మొదటి జెండా ఎగిరింది ధర్మపురిలోనే..



కేవీ కేశవులు, మాణిక్యశాస్త్రి (ఫైల్)

ధర్మపురి: నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడి, స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తింపు పొందిన జగిత్యాల జిల్లా ధర్మపురికి చెందిన కేవీ.కేశవులు, మాణిక్యశాస్త్రి ప్రాణస్నేహితులు. కేశవులు ఆనాటి ముఖ్యమంత్రి జలగం వెంగల్‌రావు హయాంలో చేనేత జౌళిశాఖ మంత్రిగా కొనసాగారు. 1947లో ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన రోజు ధర్మపురిలోని గోదావరి ఒడ్డునున్న కర్నెఅక్కెపెల్లి భవనంపై తన మిత్రుడైన మాణిక్యశాస్త్రితో కలిసి మొట్టమొదటి జాతీయ జెండాను ఆవిష్కరించారు. జెండా ఎగురవేయడం నిషేధమని అప్పటి నిజాం ప్రభుత్వం కేశవులను బంధించడానికి ప్రయత్నించగా.. నిండుగా ప్రవహిస్తున్న గోదావరిలోంచి వెళ్లి తప్పించుకున్నారు. ఏడాదిపాటు ముంబయిలో తలదాచుకున్నారు. 1948 సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినం రోజు తిరిగి ధర్మపురికి చేరుకున్నారు. 2019 జనవరి 30న అనారోగ్యంతో మృతి చెందారు.

పోరాటాల 'గాలిపల్లి'

ఇల్లంతకుంట: పోరాటాల గ్రామంగా చరిత్రలో నిలిచిపోయింది రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం గాలిపల్లి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా.. నిజాంపాలిత ప్రాంతం హైదరాబాద్ రాష్ట్రానికి ఇంకా విముక్తి లభించలేదు. బద్దం ఎల్లారెడ్డి ప్రాంతమైన గాలిపల్లి ప్రజలు నైజాం పాలనపై తిరగబడ్డారు. 1948 సెప్టెంబర్ మొదటి వారంలో రజాకార్లు గాలిపల్లికి వచ్చారు. తిరుగుబాటుదారులు వారిసైన్యంపై రాళ్లు విసిరారు. రజాకార్ల కాల్పుల్లో తిరుగుబాటుదారుల్లో ముందువరుసలో ఉన్న 11మంది చనిపోయారు. వీరిలో గాలిపల్లికి చెందిన వారు ఏడుగురు, బేగంపేట, సోమారంపేట, తాళ్లపల్లి, నర్సక్కపేట గ్రామాలకు చెందినవారు నలుగురు ఉన్నారు. రజాకార్ల పాలన నుంచి విముక్తి కలిగిన తరువాత గాలిపల్లిలో దాదాపు 20మందికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఫ్రీడంఫైటర్ పింఛన్లు మంజూరు చేశాయి.



స్వాతంత్ర్య పోరాటంలో వీరమరణం పొందిన 11 మంది శిలాఫలకం

విశ్వగురుగా భారత్



'సాక్షి' టాక్ షోకు హాజరైన విద్యార్థులు, కాలేజీ ప్రతినిధులు

సాక్షి టాక్ షో

- అతిపెద్ద ఆర్థిక శక్తిగా అవతరణ
- సాంకేతిక రంగంలోనూ శరవేగంగా వృద్ధి
- ఇంజినీరింగ్ విద్యార్థుల అభిప్రాయం
- 'ట్రినిటి' కాలేజీలో టాక్‌షో

'ప్రపంచంలోనే మనదేశం తిరుగులేని శక్తిగా అవతరిస్తోంది. 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం సాధించినప్పటి నుంచి అనేక ఒడిదొడుకులు ఎదుర్కొన్నా.. ప్రస్తుతం అన్నిరంగాల్లో దూసుకెళ్తోందని' వక్తలు అన్నారు. స్థానిక ట్రినిటి ఇంజినీరింగ్ కాలేజీలో 'స్వతంత్ర భారతం.. వందేళ్ల భవితవ్యం' అంశంపై 'సాక్షి' టాక్ షో నిర్వహించింది. కాలేజీ అటానమస్ అకడమిక్ డైరెక్టర్ అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ మణిగణేశన్, కో ఆర్డినేటర్ అశోక్, హెచ్‌వోడీ ప్రభాకర్, విద్యార్థులు పాల్గొన్నారు. మనదేశం అంతరిక్ష ప్రయోగాల్లోనూ రాణిస్తోందని తెలిపారు. యువశక్తి సంకల్ప దీక్షతో దేశఔన్నత్యాన్ని పెంచేలా ముందుకు సాగాలని అభిప్రాయపడ్డారు. పర్యావరణ పరిరక్షణకు ఎలక్ట్రిక్ వాహనాలు వినియోగం పెరుగుతోందన్నారు. సౌరశక్తిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. పారిశ్రామిక, విద్య, వైద్య రంగాల్లోనూ సూపర్‌పవర్‌గా ఎదుగుతోందని అభిప్రాయపడ్డారు. స్వతంత్రం సిద్ధించి వందేళ్లు పూర్తయ్యే నాటికి భారత్ ప్రపంచంలోనే రాజకీయ, ఆర్థిక, సాంకేతిక, సైనిక తదితర రంగాల్లో అగ్రగామిగా నిలిచి విశ్వగురుగా అవతరిస్తుందని ప్రతినిధులు ధీమా వ్యక్తం చేశారు.

– పెద్దపల్లిరూరల్

ఉపాధి కల్పించాలి



యువత శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఎదగాలి. పోటీ యుగంలో నెగ్గేందుకు నైపుణ్యం పెంపొందించాలి. ఉపాధి పొందడం కోసం కాకుండా పలువురికి ఉపాధి కల్పించేలా ఎదగాలి.

– బండారి రాహుల్, సీఎస్ఈ

ఉచితాలు వద్దు



మనదేశం ఆర్థికశక్తిగా ఎగబాకుతోంది. దీనికితోడు యువత, ప్రజలకు అవసరమైన ఉపాధి కల్పించేలా ప్రణాళిక సిద్ధం చేయాలి. ప్రజలకు ఉచితంగా లబ్ధి చేకూరే పథకాలను క్రమంగా తగ్గించాలి. యువత ఉత్పత్తి రంగంలో రాణించేలా ప్రోత్సహించాలి.

– సయిఫ్, ఈసీఈ

మన సంస్కృతి గొప్పది



మనదేశ సంస్కృతి, సంప్రదాయాలు గొప్పవి. పాశ్చాత్య దేశాలన్నీ మన సంస్కృతి పాటిస్తున్నాయి. మనం పరాయి పాలనలోని దురలవాట్లు పాటిస్తున్నాం. వాటినుంచి బయటపడి దేశ ఔన్నత్యాన్ని పెంచాలి.

– ఆఖ్య, ఈసీఈ

ఐటీ రంగంలో మేటి



సాంకేతిక పరిజ్ఞానాన్ని యువతకు అందిస్తూ ఐటీ రంగంలో మేటిగా ఉంది. దీంతో దేశ ఆర్థిక వ్యవస్థ బలపడుతోంది. ఆర్థిక, సాంకేతిక రంగాల్లో పురోగతి సాధించి మనదేశం ప్రపంచంలోనే గొప్పగా ఉంటుంది.

– మణిగణేశన్, ప్రిన్సిపాల్

కుల, మతాలకు తావుండదు



ఇప్పుడున్న కుల, మతాలు భవిష్యత్‌లో ఉండక పోవచ్చు. మనుషులంతా ఒక్కటే అనే భావన పెరిగి పరస్పర సహకారం, స్నేహభావంతో ముందుకు సాగే పరిస్థితులు వస్తాయి. ప్రస్తుతం చదువుకునే సమయంలోనే కులం అనే పదం వినిపిస్తోంది.

– ఉస్మాన్, ఎంబీఈ

సాంకేతికతపై పట్టుసాధించాలి



ప్రపంచ దేశాల మధ్య పోటీ పెరిగింది. అందులో మన దేశం అన్నిరంగాల్లో ముందుకు దూసుకుపోతోంది. సాంకేతికత, ఇంటర్నెట్ వినియోగంపై పట్టు సాధించేలా యువతకు శిక్షణ ఇవ్వాలి. ఏఐ టెక్నాలజీ రాజ్యమేలడం ఖాయం.

– ప్రొఫెసర్ అశోక్, ఆర్ అండ్ డీ కో ఆర్డినేటర్

సాంకేతికతతో అభివృద్ధి



సాంకేతిక పరిజ్ఞానం గణనీయంగా వృద్ధి చెందుతోంది. డిజిటల్ మార్కెటింగ్, వెబ్ డిజైనింగ్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ లాంటి కోర్సులను సద్వినియోగం చేసుకుంటూ యువత దేశ భవిష్యత్‌లో కీలకపాత్ర పోషించాలి.

– హసీనా, ఏఎంబీఈ

అన్నిరంగాల్లో ప్రగతి



మనదేశం అన్నిరంగాల్లో ప్రగతి సాధించి ప్రపంచంలోనే అగ్రగామిగా నిలుస్తుంది. సౌర, జల విద్యుత్‌శక్తి ఉత్పత్తి పెరుగుతోంది. యువశక్తికి కొదవలేదు. వారు దేశ ఔన్నత్యం కోసం పాటుపడేలా శిక్షణ ఇవ్వాలి.

– ప్రభాకర్, ఈసీఈ హెచ్‌వోడీ

ఇంధన భద్రతపై దృష్టి



ఇంధన భద్రత కోసం ప్రపంచంలోనే అతిముఖ్యమైన బయోఫ్యూయల్ ఉత్పత్తిపై మనదేశం దృష్టి సారించింది. సాంకేతిక పరిజ్ఞానం. స్టార్టప్ వ్యవస్థను ప్రోత్సహించడంలో అగ్రగామిగా నిలవాలి. ఇంధన మిశ్రమంలో గ్యాస్ వాటా పెంచాలి.

– శివాని, ఏఎంబీఈ

ఆటోమేషన్‌పై ఫోకస్



స్వతంత్ర భారతానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. ఆటోమేషన్, టెక్నాలజీ తదితర రంగాలపై ఫోకస్ పెడితే ఆర్థికవృద్ధి సాధిస్తుంది. ఇంటర్నెట్ వినియోగం, డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో ముందుంది.

– అశోక్‌కుమార్, అకడమిక్ డైరెక్టర్

న్యూస్‌రీల్

ఆంజనేయరాజుకు అవార్డు



ఆంజనేయరాజు

జ్యోతినగర్(రామగుండం): రామగుండంలోని ఎన్టీపీసీ సీఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ ఎస్.ఆంజనేయరాజుకు ప్రతిష్టాత్మక రాష్ట్రపతి మెరిటోరియస్ సర్వీస్ పతకం లభించింది. ఆంజనేయరాజు సేవలను గుర్తించిన అధికారులు.. ఆయనను మెరిటోరియస్ సర్వీస్ మెడల్‌కు ఎంపిక చేశారు. ఆయనను సీఐఎస్ఎఫ్ సీనియర్ కమాండెంట్ అరవింద్ కుమార్, అధికారులు, జవాన్‌లు, ప్రాజెక్టు అధికారులు తదితరులు అభినందించారు.

'స్వచ్ఛ సర్వేక్షణ్' పర్యటన



పరిసరాలపై ఆరా తీస్తున్న ప్రతినిధులు

ఎలిగేడు(పెద్దపల్లి): స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్–2025 కేంద్ర బృందం గురువారం ధూళికట్టలో పర్యటించింది. స్కూళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించింది. సేవలపై ఆరా తీసింది. ఇంకుడుగుంతలు, మరుగుదొడ్ల వినియోగం, కిచెన్ గార్డెన్‌లు, డ్రైనేజీలు తదితర వాటి ఫొటోలు తీసుకుంది. సభ్యులు వి.మధు, డి.రజిత ఎంపీడీవో భాస్కర్‌రావు, ఎంపీవో కిరణ్, ఎస్‌బీఎం కో ఆర్డినేటర్ రాఘవులు, పంచాయతీ కార్యదర్శులు పున్నమయ్య, అంజలి, ఏపీవో సదానందం, ఏపీఎం గీత, సీసీ మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి అధికారుల నిరసన



నిరసన తెలుపుతున్న అధికారులు

రామగిరి(మంథని): పెర్ఫార్మెన్స్ రిలేటెడ్ పే (పీఆర్పీ) కోసం సింగరేణి అధికారులు మూడు రోజులుగా ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఆర్జీ–3 ఏరియా ఓసీపీ–1, 2, అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టులోని వివిధ విభాగాల అధికారులు జీఎం కార్యాలయం ఎదుటట నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. సీఎంవోఏఐ నాయకులు మాట్లాడుతూ 2022–23, 2023–24 ఆర్థిక సంవత్సరాల పీఆర్పీ ఇప్పటివరకు చెల్లించలేదన్నారు. కోల్ ఇండియాలో ఏటా చెల్లిస్తోందన్నారు. డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు, సింగరేణి సీఎండీ బలరాం నాయక్ చొరవ తీసుకుని సమస్యలు పరిష్కారించాలని కోరారు. జీఎంలు సుధాకర్‌రావు, నాగేశ్వరరావు, అధికారుల సంఘం నేతలు వెంకటరమణ, శ్రీనివాస్‌రావు, సుదర్శనం పాల్గొన్నారు.

బీజేపీ తిరంగా యాత్ర



తిరంగాయాత్రలో నాయకులు

పెద్దపల్లిరూరల్: బీజేపీ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలో తిరంగా యాత్ర నిర్వహించారు. కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రగతినగర్ చౌరస్తా నుంచి కమాన్ వరకు యాత్ర కొనసాగింది. నాయకులు ఠాకూర్ రాంసింగ్, జంగ చక్రధర్‌రెడ్డి, నల్ల మనోహర్ రెడ్డి, పల్లె సదానందం, ఫహీం, క్రాంతి, లక్ష్మీనారాయణ, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పదవీకాలం పొడిగింపు

సుల్తానాబాద్(పెద్దపల్లి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పదవీకాలం మరో ఆర్నెల్లపాటు పొడిగించినట్లు ఉత్తర్వులు జారీ అయ్యాయని డీసీవో శ్రీమాల తెలిపారు. పీఏసీఎస్ పదవీకాలం గురువారం ముగిసిందన్నారు. దీంతో పీఏసీఎస్‌ల పదవీకాలం పొడిగిస్తూ సర్కార్ ఉత్తర్వులు ఇచ్చిందని వివరించారు.

ప్రభుత్వ ఆస్పత్రికి మహర్దశ

మంథని: స్థానిక ప్రభుత్వ సామాజిక వైద్యశాలకు మహర్దశ పట్టనుంది. సౌకర్యాల కల్పన, డాక్టర్ల నియామకం, పలు అభివృద్ధి పనులకు రూ.20లక్షలు మంజూరు కావడంతో ఆస్పత్రి రూపురేఖలు మారుతాయని జిల్లా మెడికల్ సూపరింటెండెంట్ శ్రీధర్ తెలిపారు. ఇద్దరు డాక్టర్ల నియామకం, రూ.5లక్షలతో వెయిటింగ్ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయన్నారు. మాతాశిశు ఆస్పత్రిలో గర్భిణుల కోసం రూ.12లక్షలతో అల్ట్రా సౌండ్ స్కానింగ్, శిశువుల కోసం రూ.1.12లక్షలతో వార్మర్, ఫొటో థెరపీ, రూ.1.80లక్షలతో ఆర్‌వో ప్లాంట్ ఏర్పాటు చేస్తామన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాలతో కలెక్టర్ నిధులు మంజూరు చేశారన్నారు.

రేపు ఎస్జీఎఫ్ క్రీడాపోటీలు

జ్యోతినగర్(రామగుండం): జిల్లాస్థాయి ఎస్జీఎఫ్ క్రీడా ఎంపిక పోటీలు ఈనెల 16న నిర్వహించనున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి కనుకుంట్ల లక్ష్మణ్ తెలిపారు. ఎన్టీపీసీ జెడ్పీ హైస్కూల్‌లో అండర్–15లో వాలీబాల్, ఫుట్‌బాల్ పోటీలు ఉంటాయని పేర్కొన్నారు.

ఇందిరమ్మ లబ్ధిదారులకు అప్పు ఇవ్వండి

- స్వశక్తి సంఘాలకు కలెక్టర్ శ్రీహర్ష సూచన



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: ఇందిరమ్మ ఇల్లు మంజూరైన స్వశక్తి సంఘాల మహిళలకు రూ.లక్ష అప్పు ఇవ్వాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష స్వశక్తి సంఘాల ప్రతినిధులకు సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం వివిధ శాఖల పనితీరుపై సమీక్షించారు. స్త్రీనిధి, బ్యాంక్ లింకేజీ రుణ లక్ష్యాలు పూర్తికావాలని సూచించారు. ఈనెల 26న విదేశాల్లో ఉపాధి అవకాశాలపై టామ్‌కామ్ ద్వారా అవగాహన సదస్సు నిర్వహిస్తామని తెలిపారు. పీఎంశ్రీ పాఠశాల, యంగ్‌ఇండియా గురుకులాలు, జూనియర్, డిగ్రీకాలేజీలు, గోదావరిఖని శాతవాహన యూనివర్సిటీ అడ్మిన్‌బ్లాక్, సుల్తానాబాద్ బాలసదనం తదితర పనుల పురోగతిపై ఆరా తీశారు. రూ.23.75 కోట్లతో చేపట్టిన గోదావరిఖని ఆస్పత్రి అభివృద్ధి, రూ.22కోట్లతో మంథనిలో చేపట్టిన ఆస్పత్రి నిర్మాణాలను వేగంగా పూర్తిచేయాలని ఆదేశించారు. అయా కార్యక్రమాల్లో అడిషనల్ కలెక్టర్ వేణు, డీఆర్డీవో కాళిందిని, అడిషనల్ డీఆర్డీవో రవీందర్, డీసీపీ కరుణాకర్, ఏసీపీ కృష్ణ, ఈఈ అశోక్‌కుమార్, ఏఈ నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎఫ్‌సీఎల్ ప్లాంట్ షట్‌డౌన్

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): ఆర్ఎఫ్‌సీఎల్‌ను గురువారం రెండో షిఫ్టులో సాంకేతిక కారణాలతో షట్‌డౌన్ చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్లాంట్ షట్‌డౌన్ కావడం ఇది మూడోసారి. ప్రస్తుతం యూరియా కొరత ఉంది. రైతులకు సకాలంలో సరఫరా చేసేందుకు కేంద్ర ఎరువుల రసాయనాల శాఖ తీవ్ర ఒత్తిడి చేస్తోంది.

ప్రజలు ఏకతాటిపైకి రావాలి

- రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్



ర్యాలీలో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: న్యాయ సమ్మతమైన ఎన్నికల కోసం ప్రజలు ఏకం కావాలని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ కోరారు. స్థానిక ప్రధాన చౌరస్తాలో గురువారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. 'ఓట్ల దొంగలు – గద్దె దిగండి' అంటూ నినాదాలు చేశారు. ప్రజాస్వామ్యంలో పవిత్రమైన ఓటును దోచుకునే వారికి రాజకీయాల్లో స్థానం ఉండవద్దని అన్నారు. నాయకులు మహంకాళి స్వామి, బొంతల రాజేశ్, తిప్పారపు శ్రీనివాస్, ప్రకాశ్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

పాలకుర్తి(రామగుండం): గ్రామాల అభివృద్ధే ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. బసంత్‌నగర్, పాలకుర్తి, ఈసాలతక్కళ్లపల్లి, కొత్తపల్లి, రామారావుపల్లి, పుట్నూర్, జయ్యారం, కుక్కలగూడూర్, వేంనూర్ గ్రామాల్లో చేపట్టిన రోడ్లు, తదితర అభివృద్ధి పనులకు తన సతీమణి మనాలీ ఠాకూర్‌తో కలిసి గురువారం భూమిపూజ చేశారు. కొత్త రేషన్ కార్డులు, షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. ప్రతీ సంక్షేమ పథకం అర్హులైన ప్రతీఒక్కరికి అందిస్తామన్నారు. నాయకులు తిరుపతి, మనోహర్‌రెడ్డి, రమేశ్, శ్రీనివాస్, సూర సమ్మయ్య, పర్శవేని శ్రీనివాస్, తంగెడ అనిల్‌రావు, తలారీ శంకర్, శిలగాని రాజేశం, మల్లెత్తుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

రామగుండం: అంతర్గాం, రామగుండంలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కుందనపల్లి అర్బన్ పార్క్‌లోని అటవీశాఖ జిల్లా నివాసాన్ని ప్రారంభించారు.

క్లుప్తంగా

తల్లి మందలించిందనే మనస్తాపంతో ఆత్మహత్య

ధర్మారం(ధర్మపురి): పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం కటికెనపల్లి గ్రామంలో సంపంగి సంధ్య(25) పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం.. సంధ్య – రమేశ్ భార్యాభర్తలు. వీరికి కూతురు వర్షిత ఉంది. రామగుండం స్వస్థలం. అయితే, వృత్తి రీత్యా లారీ డ్రైవర్ అయిన రమేశ్.. తన అత్తగారిల్లు కటికెనపల్లిలో ఉంటూ పనిచేసుకుంటున్నాడు. అయితే, సంధ్య కూతురు బుధవారం ఇంటివద్ద అల్లరి చేస్తోంది. అల్లరి ఎందుకు చేస్తున్నావని కొడుతోంది. గమనించిన సంధ్య తల్లి మామిడి సత్తమ్మ.. పాపను ఎందుకు కొడుతున్నావని మందలించింది. క్షణికావేశానికి లోనైన సంధ్య తీవ్రమనస్తాపం చెందింది. తన పత్తి చేనులోకి వెళ్లి గడ్డిమందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

రెస్టారెంట్‌లో నాసిరకం పదార్థాలు

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖనిలో నాణ్యతలేని ఆహార పదార్థాలను వడ్డిస్తున్న ఓ ప్రముఖ రెస్టారెంట్‌లో రామగుండం నగర పాలక సంస్థ అధికారులు తనిఖీలు చేసి రూ.10వేల జరిమానా విధించారు. స్థానిక సాయిలీల రెసిడెన్సీ, హైకింగ్ ఫ్యామిలీ రెస్టారెంట్‌లో వడ్డించిన ఆహారం నాణ్యతగా లేదని వినియోగదారు బల్దియా కమిషనర్ అరుణశ్రీకి గురువారం ఫోన్ ద్వారా సందేశం పంపించాడు. కమిషనర్ ఆదేశాలతో అధికారులు రెస్టారెంట్‌లో తనిఖీలు చేశారు. నాణ్యత లేనిఆహార పదార్థాలు గుర్తించి రూ.10వేలు జరిమానా విధించారు. డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నాగభూషణం, సంపత్, ఇంజినీర్ మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్య

వీణవంక(హుజూరాబాద్): కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కొండపాక గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పానుగంటి ప్రమీల(56) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుందని పోలీసులు తెలిపారు. పానుగంటి విజయ్‌కుమార్,ప్రమీల దంపతులు. వీరికి ఇద్దరు కొడుకులు, రెండు, మూడు రోజులుగా ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఇంటిలోని బాత్‌రూంలో ఇనుపరాడుకు చీరతో ఉరేసుకుంది. భర్త విజయ్‌కుమార్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఆవుల తిరుపతి తెలిపారు.

రైళ్ల హాల్టింగ్ పునరుద్ధరణ



రామగుండం రైల్వేస్టేషన్

రామగుండం: పెద్దపల్లి, రామగుండం రైల్వేస్టేషన్లలో గతంలో రద్దు చేసిన పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్‌ను ఈనెల 15న పునరుద్ధరించనున్నట్లు ఉత్తర తెలంగాణ రైల్వే ఫోరం అధ్యక్షుడు కంకటి ఫణి గురువారం తెలిపారు. ఐఆర్‌సీటీసీ రైల్వే పోర్టల్‌లోపై వాటి రాకపోకలు, హాల్టింగ్ మార్పును అప్‌డేట్ చేయనున్నట్లు వెల్లడించారు.

హాల్టింగ్ పునరుద్ధరణ ఇలా..

రైలు నంబరు : 12656 : చెన్నై సెంట్రల్–అసర్వ జంక్షన్ (నవజీవన్ సూపర్‌ఫాస్ట్): పెద్దపల్లి జంక్షన్‌కు రాత్రి 8.59 గంటలకు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో(12655) సాయంత్రం 4.45గంటలకు చేరుకుంటుంది.

రైలు నంబరు : 22737 : సికింద్రాబాద్–హిస్సార్ (హిస్సార్ సూపర్‌ఫాస్ట్): ప్రతీ మంగళ, బుధవారాల్లో పెద్దపల్లి జంక్షన్‌కు వేకువజామున 2.34గంటలకు చేరుకుంటుంది. దీనికి ఈనెల 19 నుంచి హాల్టింగ్ ఉంటుంది.

రైలు నంబరు : 17005 : హైదరాబాద్–రక్సోల్ (రక్సోల్ సూపర్‌ఫాస్ట్): ప్రతీ గురువారం వేకువజామున 2.34గంటలకు పెద్దపల్లి జంక్షన్‌కు చేరుకుంటుంది. ఈనెల 21 నుంచి పెద్దపల్లి జంక్షన్‌లో హాల్టింగ్ ఉంటుంది.

రైలు నంబరు : 17006 : రక్సోల్ –హైదరాబాద్ (రక్సోల్ సూపర్‌ఫాస్ట్): ప్రతీ ఆదివారం రాత్రి 11.59గంటలకు పెద్దపల్లి జంక్షన్‌కు చేరుకుంటుంది. ఈనెల 17 నుంచి హాల్టింగ్ ఉంటుంది.

రైలు నంబరు : 12295 : బెంగళూరు–దానాపూర్ (సంఘమిత్ర సూపర్‌ఫాస్ట్): ప్రతీరోజు వేకువజామున 2.09గంటలకు రామగుండం రైల్వేస్టేషన్ చేరుకుంటుంది. శుక్రవారం నుంచి హాల్టింగ్ ఉంటుంది.

చిల్లపల్లి కార్యదర్శికి సన్మానం

- నేడు ఎర్రకోటలో పంద్రాగస్టు వేడుకలకు హాజరు


మంత్రితో సన్మానం పొందుతున్న కార్యదర్శులు

పెద్దపల్లిరూరల్/మంథనిరూరల్: గతేడాది జాతీయ స్థాయిలో ఉత్తమ పంచాయతీ అవార్డు అందుకున్న మంథని మండ లం చిల్లపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి రాంకిశోర్‌ను భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వశాఖ, పంచాయతీరాజ్ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర పంచాయతీరాజ్ మంత్రి సన్మానించారు. గురువారం న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో చిల్లపల్లి సెక్రటరీతోపాటు రాష్ట్రంలోని వివిధ గ్రామ పంచాయతీలకు చెందిన మరో ఐదుగురు కార్యదర్శులను సత్కరించారు. వీరితోపాటు పెద్దపల్లి జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య ఆగస్టు 15న న్యూఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగే స్వాతంత్ర్య వేడుకలకు ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరుకానున్నారు. సర్పంచులు లేకపోవడంతో వారి స్థానంలో పంచాయతీ కార్యదర్శులను ఆహ్వానించారు.

లారీ, బైక్ ఢీకొని ఒకరి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు

మంథని: గంగాపురి వద్ద ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈప్రమాదంలో పెద్దపల్లి మండలం కనగర్తికి చెందిన చెట్టం వెంకటేశ్(30) మృతి చెందగా.. మంథని మండలం ధర్మారం గ్రామానికి చెందిన తిప్పని అభిలాష్ తీవ్రంగా గాయపడ్డాడు. వెంకటేశ్, అభిలాష్ ఒక కార్యక్రమానికి హాజరై తిరిగి ద్విచక్రవాహనంపై పెద్దపల్లి వైపు వెళ్తుండగా ప్రమాదం జరిగింది. గాయపడిన అభిలాష్‌ను 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. పోలీసులు వివరాలు సేకరించారు.

విషజ్వరంతో ఒకరు..

సారంగాపూర్: మండల కేంద్రంలోని మోతుకు గంగమల్లు (55) విషజ్వరంతో బాధపడుతూ గురువారం మృతిచెందాడు. గంగమల్లు రెండురోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. బంధువులు జిల్లాకేంద్రంలోని ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతున్న క్రమంలో గుండెపోటు రావడంతో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

పంద్రాగస్టుకు పోదువు.. లే కొడుకా

- పాఠశాలకు వెళ్తుండగా అదుపుతప్పిన ఆటో
- నాలుగేళ్ల బాలుడి దుర్మరణం.. నలుగురికి తీవ్రగాయాలు
- రెండు నిమిషాల్లో ఇంటికి చేరే క్రమంలో ప్రమాదం
- కరీంనగర్ జిల్లా మన్నెంపల్లి శివారులో ఘటన


హర్షవర్ధన్(ఫైల్)

తిమ్మాపూర్: ఉదయం అందరితో కలిసి సంతోషంగా బడికి వెళ్లాడు. తెల్లవారితే పంద్రాగస్టు కావడంతో ఆ వేడుకల గురించే తోటి పిల్లలతో మాట్లాడుకుంటూ ఇంటికి ఆటోలో బయల్దేరాడు. కానీ, ఆ బాలుడి ఆనందం మార్గంమధ్యలోనే ఆవిరైంది. ఆటో ప్రమాదం అనంతలోకాలకు తీసుకెళ్లింది. 'పంద్రాగస్టుకు పోతువు లే.. కొడుకా' అంటూ తల్లిదండ్రులు రోదించిన తీరు స్థానికులను కన్నీరు పెట్టించింది. ఈ విషాద ఘటన కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లి గ్రామ శివారులో గురువారం చోటుచేసుకుంది.


నాంపల్లి హర్షవర్ధన్ మృతదేహం


తిమ్మాపూర్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన 15 మంది విద్యార్థులతో స్కూల్ నుంచి ఆటో మన్నెంపల్లికి బయల్దేరింది. గ్రామానికి 500మీటర్ల దూరంలో కుక్కలు ఆటో వెంట పరుగెత్తడంతో డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేశాడు. ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. 15మంది చిన్నారుల్లో నలుగురికి తీవ్రగాయాలు, మిగిలినవారికి స్వల్ప గాయాలయ్యాయి. మన్నెంపల్లికి చెందిన 4వ తరగతి విద్యార్థి నాంపల్లి హర్షవర్ధన్ (9) తీవ్రంగా గాయపడ్డాడు. ఆటో ఎడమవైపు కూర్చున్న హర్షవర్ధన్‌పై ఆటో బరువుపడడంతోపాటు, పగిలిన ఆటో అద్దాలు అతని తలలో గుచ్చుకున్నాయి. ఎడమ చేయి కూడా దెబ్బతిని నుజ్జునుజ్జుగా మారింది. వెంటనే ఆస్పత్రికి తరలించినా గాయాల తీవ్రతతో హర్షవర్ధన్ మృతి చెందాడు. అదే ఆటోలో హర్షవర్ధన్ అక్క నాంపల్లి శ్రీసాహితి కూడా ఉంది. తమ్ముడు కళ్లముందే తీవ్రంగా గాయపడడం చూసి బోరున విలపించింది. హర్షవర్ధన్ తల్లిదండ్రులు నాంపల్లి శ్రీనివాస్, సమతలు వ్యవసాయం చేస్తూ, కష్టపడి పిల్లలను చదివిస్తున్నారు. ఈ దుర్ఘటన వారి కుటుంబాన్ని తీవ్ర శోకంలో ముంచెత్తింది. శ్రీనివాస్ ఫిర్యాదుతో ఆటో డ్రైవర్ అనిల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

స్వగ్రామం చేరిన మృతదేహం

చొప్పదండి: దేశాయిపేటకు చెందిన ఎలకపల్లి అంజయ్య సౌది అరేబియాలో మృతి చెందగా గురువారం మృతదేహం స్వగ్రామం చేరుకుంది. ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లిన అంజయ్య అక్కడ మృతి చెందగా కుటుంబ సభ్యులు గల్ఫ్ జేఏసీని సంప్రదించారు. వారి కృషితో ఎట్టకేలకు మృత దేహం స్వగ్రామానికి చేరుకుందని గ్రామస్తులు తెలిపారు. అంజయ్య కుటుంబానికి రూ.ఐదులక్షల ఎక్స్‌గ్రేషియా వచ్చేలా చూడాలని గల్ఫ్ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి కాంత ప్రభుత్వాన్ని కోరారు.

సూక్ష్మకళ.. భళా

ఓదెల(పెద్దపల్లి): మడక గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆడెపు రజనీకాంత్ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పెన్సిల్ మొనపై 4 మి.మీ. పొడవు, 2 మి.మీ. వెడల్పుతో అతిచిన్న జాతీయ జెండా రూపొందించారు. ఇందుకోసం సుమారు గంట సమయం తీసుకున్నారు. చాక్‌పీస్‌పై 7 మి.మీ. పొడవు, 5 మి.మీ. వెడల్పుతో గంట పది నిమిషాలపాటు శ్రమించి చెక్కారు. చాక్‌పీస్‌పై హ్యాపీ ఇండిపెండెన్స్‌డే ఆంగ్ల అక్షరాలు చెక్కి శుభాకాంక్షలు చెక్కారు. వీటిని వివిధ బుక్ ఆఫ్ రికార్డులకు ప్రతిపాదించినట్లు రజనీకాంత్ తెలిపారు.





ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి


ఆయుధాలు పరిశీలిస్తున్న అంబర్ కిశోర్ ఝా

గోదావరిఖని: బాధితుల ఫిర్యాదులపై పోలీసులు తక్షణమే స్పందించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగం గురువారం గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను తనిఖీ చేశారు. పెండింగ్, కోర్టు, దర్యాప్తు కేసులపై ఆరా తీశారు. ప్రజల్లో విశ్వాసం పెంపొందించడానికి ప్రతీఒక్కరు క్రమశిక్షణ, నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వహించాలని సూచించారు. అనంతరం ఠాణా ఆవరణలో మొక్కలు నాటారు. పెద్దపల్లి డీసీపీ కరుణాకర్, గోదావరిఖని ఏసీపీ రమేశ్, వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, రవీందర్, ఎస్సైలు భూమేశ్, రమేశ్ పాల్గొన్నారు.

సేవలకు దక్కిన గౌరవం

- ఇండియన్ పోలీస్ మెడల్‌కు ఇద్దరు ఏఎస్సైలు


రాజేశుని శ్రీనివాస్


రుద్ర కృష్ణకుమార్

జగిత్యాలక్రైం/మల్యాల: విధి నిర్వహణలో వారు ఎప్పుడూ ముందున్నారు. తమ సర్వీసులో ఏనాడూ మచ్చ కూడా ఎరగరు. వారి సేవలను గుర్తించిన కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అనేక పతకాలు అందించింది. తాజాగా ప్రతిష్ఠాత్మకమైన ఇండియన్ పోలీస్ మెడల్‌కు కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. జగిత్యాల స్పెషల్ బ్రాంచ్ ఏఎస్సై రాజేశుని శ్రీనివాస్, మల్యాల పోలీస్‌స్టేషన్ ఏఎస్సై రుద్ర కృష్ణకుమార్‌కు మెడల్ ప్రకటించింది. రాజేశుని శ్రీనివాస్ 1989లో కానిస్టేబుల్‌గా పోలీసుశాఖలో చేరారు. 2012లో హెడ్ కానిస్టేబుల్‌గా, 2019లో ఏఎస్సైగా పదోన్నతి పొందారు. 2012లో రాష్ట్ర పోలీసు సేవా పథకం, 2019లో ఉత్తమ సేవా పథకం అందుకున్నారు. 36ఏళ్లుగా పోలీస్ పోలీసు శాఖకు చేస్తున్న సేవలను గుర్తించి కేంద్రప్రభుత్వం ఇండియన్ పోలీస్ మెడల్‌కు ఎంపిక చేసింది. అలాగే రుద్ర కృష్ణ కుమార్ 1989లో కానిస్టేబుల్‌గా పోలీసుశాఖలో చేరారు. 2017లో హెడ్‌కానిస్టేబుల్‌గా.. 2021లో ఏఎస్సైగా పదోన్నతి పొందారు. 2022లో రాష్ట్ర పోలీసు సేవా పథకానికి ఎంపికయ్యారు. 36 ఏళ్లుగా చేస్తున్న సేవలను గుర్తించి ఇండియన్ పోలీస్ మెడల్‌కు ఎంపిక చేశారు. ఇద్దరిని జగిత్యాల ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు. కష్టపడి పనిచేసే పోలీస్ అధికారులకు గుర్తింపు వస్తుందని తెలిపారు. గురువారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు.

లీడింగ్ ఫైర్ ఆఫీసర్ వహిదుల్లాఖాన్‌కు రాష్ట్రపతి పతకం


వహిదుల్లాఖాన్

మెట్‌పల్లి: జగిత్యాల జిల్లా మెట్‌పల్లి ఫైర్ స్టేషన్‌లో లీడింగ్ ఫైర్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న వహిదుల్లాఖాన్ అత్యున్నత పురస్కారమైన రాష్ట్రపతి పతకానికి ఎంపికయ్యారు. 1986లో ఫైర్‌మెన్‌గా అగ్ని మాపక శాఖలో చేరిన ఆయన.. ఆసిఫాబాద్, ఇచ్చోడ, ఆదిలాబాద్, పెద్దపల్లి, కరీంనగర్‌లో పని చేసి.. రెండేళ్ల క్రితం మెట్‌పల్లికి బదిలీపై వచ్చారు. 2015లో లీడింగ్ ఫైర్‌మెన్‌గా పదోన్నతి పొందారు. మొదటి నుంచి అంకితభావంతో పనిచేసే ఆయన విపత్తుల సమయాల్లో సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తారనే పేరు సంపాదించారు. అత ని సేవలకు గుర్తింపుగా ఇప్పటివరకు ఆరు ప్రశంసపత్రాలు, ఒక సేవాపతకం ప్రదానం చేశారు. ప్రస్తుతం రాష్ట్రపతి పతకానికి ఎంపిక కావడంపై ఆయనను ఉన్నతాధికారులు అభినందించారు.

లీడింగ్ ఫైర్‌మెన్ గోపాల్‌రెడ్డికి రాష్ట్రపతి అవార్డు


గోపాల్‌రెడ్డి

జమ్మికుంట: జమ్మికుంట పట్టణ అగ్నిమాపక కేంద్రంలో లీడింగ్ ఫైర్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న బీరెడ్డి గోపాల్‌రెడ్డికి అరుదైన గౌరవం దక్కింది. ఫైర్‌మెన్‌గా విధుల్లో అత్యంత ఉత్తమ సేవలు అందించినందుకు రాష్ట్రపతి అవార్డుకు ఎంపికయ్యారు. ఫైర్ ఆఫీసర్‌గా విధుల్లో క్రమ శిక్షణ, నిబద్ధతతో పని చేసినందుకు అవార్డుకు ఎంపికైనట్లు గోపాల్‌రెడ్డి తెలిపారు.

క్రెడిట్ కార్డుల కమీషన్ పేరుతో డబ్బులు స్వాహా..

- నిందితుడి అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఇన్‌స్పెక్టర్ శివకుమార్



వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ శివకుమార్

వరంగల్ క్రైం: క్రెడిట్ కార్డుల ద్వారా కమీషన్ తీసుకోకుండా డబ్బులు ఇస్తానంటూ బాధితుల నుంచి లక్షలు స్వాహా చేసిన నిందితుడిని అరెస్ట్ చేసినట్లు హనుకొండ ఇన్‌స్పెక్టర్ ఎం.శివకుమార్ తెలిపారు. గురువారం పీఎస్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం మడిపల్లికి చెందిన నేరెళ్ల అరుణ్ 2023లో హనుమకొండ రాయపురలో 'భద్రకాళి డిజిటల్ సేవ' పేరుతో షాపు ఏర్పాటు చేశాడు. ఆన్‌లైన్ అప్లికేషన్స్‌తోపాటు కస్టమర్ల క్రెడిట్ కార్డు స్వైప్ చేసి వారికి డబ్బులు ఇచ్చేవాడు. రెగ్యులర్ కస్టమర్లను తన వాలెట్‌లో యాడ్ చేసుకుని వారి క్రెడిట్ కార్డుల్లో బ్యాలెన్స్ ఉంటే ఫోన్ చేసేవాడు. తాను వేరే పేమెంట్ చేసేది ఉందని చెప్పి వారి కార్డులు స్వైప్ చేసి వారికి ఎలాంటి చార్జీలు లేకుండా తానే క్రెడిట్ కార్డుల బిల్లులు చెల్లిస్తానని మోసం చేసేవాడు. కార్డులు స్వైప్ చేసిన తర్వాత వేరే కస్టమర్ల కార్డులు పేమెంట్ చేసి దానికి 4 శాతం వరకు చార్జీ తీసుకుని లాభం పొందేవాడు. ఎలాంటి కమీషన్ లేకుండా డబ్బులు డ్రా చేసి ఇస్తానని నమ్మించి డబ్బులు వాడుకున్న అనంతరం కొన్ని రోజుల తర్వాత ఇతరుల క్రెడిట్ కార్డు బిల్లులు చెల్లించేవాడు. ఏడాదిన్నరపాటు కస్టమర్లకు నమ్మకంగా ఉంటూ వారి క్రెడిట్ కార్డు బిల్లులు చెల్లిస్తూ, క్రెడిట్ కార్డులు స్వైప్ చేస్తూ బాధితుల డబ్బుల నుంచి తన క్రాప్ లోన్, అప్పులు కట్టుకున్నాడు. ఇలా సుమారు రూ.28 లక్షలు వాడుకున్నాడు. కొద్ది రోజులుగా విజయవాడలో ఉంటున్న నిందితుడు బుధవారం షాపు ఖాళీ చేస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించగా అరెస్ట్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

జీదబిడ్డల చదువంటే మంత్రికి చులకనే..

- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్


మాట్లాడుతున్న మాజీఎమ్మెల్యే పుట్ట మధు

మంథని: అట్టడుగు వర్గాలకు చెందిన బిడ్డల ఉన్నత చదువులంటే మంత్రికి చులకనేనని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆరోపించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను గురువారం ఆయన సందర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఉన్నత విద్యను ప్రోత్సహిస్తున్నామని చెబుతున్న మంత్రి.. జేఎన్టీయూలో స్థానికేతర విద్యార్థులు 118మంది ఉంటే 72మంది మంథనికి చెందిన వాళ్లుఉన్నారని, పాలిటెక్నిక్‌లో వంద మందికి కేవలం 16మంది మాత్రమే మంథని ప్రాంతవాసులు ఉన్నారని, తద్వారా ఇవి ఎవరికి ఉపయోగపడుతున్నాయో ఆలోచన చేయాలన్నారు. ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు పెట్టించడం తప్ప పేదవిద్యార్థుల భవిష్యత్ కోసం ఆలోచన లేదన్నారు. తనను కేసుల్లో ఇరికించాలని ఎన్నిప్రయత్నాలు చేసినా భయపడేది లేదని, శ్వాస ఉన్నంతవరకు ప్రజల కోసం పోరాటం చేస్తానని స్పష్టం చేశారు. నాయకులు ఏగోళపు శంకర్‌గౌడ్, ఆరెపల్లి కుమార్, కనవేన శ్రీనివాస్, గోనె శ్రీనివాసరావు, మాచిడి రాజుగౌడ్, వేల్పుల గట్టయ్య, గొబ్బూరి వంశీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంతో చెలగాటం

- రెండు ఆస్పత్రులు, క్లినికల్ ల్యాబ్‌కు భారీగా జరిమానా


జరిమానా విధిస్తున్న అధికారులు

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరపాలక సంస్థలోని పలు ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులు, బయో మెడికల్ వేస్ట్(జీవ వైద్య వ్యర్థాలు) నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. లక్ష్మీనగర్‌లో బల్దియా పారిశుధ్య విభాగం అధికారులు గురువారం చేసిన తనిఖీల్లో ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులు బహిరంగ ప్రదేశాల్లో పడేసిన బయో మెడికల్ వేస్ట్ వెలుగు చూసింది. ప్రమాదకరమైన బయో మెడికల్ వేస్ట్‌ను బయట పడవేసిన శ్రీఅదితి హాస్పిటల్‌కు రూ.లక్ష, సత్యం హాస్పిటల్‌కు రూ.50వేలు, వెంకటసాయి క్లినికల్ ల్యాబ్‌కు రూ.10వేలు జరిమానా విధించారు. బయో మెడికల్ వేస్ట్‌ను బహిరంగ ప్రదేశాల్లో వేస్తే జరిమానా విధించడంతోపాటు మున్సిపల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.